

ఐకమత్యంతో పోరాడాలి
రైతులు తమ భూములను కాపాడుకునేందుకు ఐకమత్యంతో పోరాడాలని ప్రొఫెసర్ కోదండరాం సూచించారు. - 8లో



ప్రజాకోర్టులోనే తేల్చుకుంటాం
రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వ రద్దుపై ప్రజా కోర్టులోనే తేల్చుకుంటామని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
37° / 25°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-35 (శనివారం సాయంత్రం)
సహర్ 4-48 (ఆదివారం ఉదయం)

న్యూస్‌రీల్

నేడు స్థాయీ సంఘం సమావేశం

సూర్యాపేటటౌన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం 1, 7వ స్థాయీ సంఘం, 2, 4వ స్థాయీ సంఘం సమావేశాన్ని జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక అధ్యక్షత నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న జ్యోతిపద్మ

హుజూర్‌నగర్: చిరుధాన్యాలతో సమతుల్య ఆహారం లభిస్తుందని జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్త హీనతను అధిగమించేందుకు చిరుధాన్యాలతో చేసిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీడీపీఓ హేమాదేవి, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణయ్య, డీసీపీఓ రవి, సూపర్‌వైజర్లు సోమమ్మ, వసంత లక్ష్మి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ రాజేష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అశోక్



గొండ్రాల అశోక్



ప్రధాన కార్యదర్శి నర్సయ్య యాదవ్

చివ్వెంల(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది గొండ్రాల అశోక్ రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి ఇరువురు పోటీలో ఉండడంతో శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది పోలేబోయిన నర్సయ్య యాదవ్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా కంచర్ల సతీష్ కుమార్, జాయింట్ సెక్రటరీగా రాంపాక ఉప్పలయ్య, కోశాధికారిగా రాచకొండ యాదగిరి, లైబ్రరీ కార్యదర్శిగా కోణం రఘురామయ్య, గేమ్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా కోక రంజిత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సుంకర రవికుమార్, పోలోజు మధు, మామిడి మట్టయ్య, పత్తిపాక రాధాకృష్ణ, తండు సైదులు గౌడ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు న్యాయవాదులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




మాట్లాడుతున్న సూర్యం

దురాజ్‌పల్లి : అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ సంఘం ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు కాని దౌర్భాగ్యం నెలకొందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, ఉపాధ్యక్షులు ఎస్‌కే.గులాం హుస్సేన్, సహాయకార్యదర్శి కాసర్ల దుర్గయ్య, కోశాధికారి గోగుల వీరబాబు పాల్గొన్నారు.

ఆదాయం ఫుల్

కాసుల వర్షం కురిపించిన ఆర్టీఏ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖలు
- గతేడాది కంటే పెరిగిన రాబడి
- ఆర్టీఏ ద్వారా రూ.102.46కోట్ల వసూలు
- రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా సమకూరిన రూ.100.32 కోట్ల ఆదాయం



రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆదాయం వివరాలు

కార్యాలయం	2021- 22		2022- 23	
	డాక్యుమెంట్లు	ఆదాయం	డాక్యుమెంట్లు	ఆదాయం
సూర్యాపేట	17,735	రూ.44.26కోట్లు	17,820	రూ.49.68కోట్లు
కోదాడ	12,192	రూ.24.99	12,738	రూ.37.98కోట్లు
హుజూర్‌నగర్	4,853	రూ.9.66కోట్లు	5,779	రూ.12.66కోట్లు

సూర్యాపేటటౌన్: గడిచిన మూడేళ్లుగా కరోనాతో దెబ్బ తిన్న కొన్ని ప్రభుత్వ ఆదాయ శాఖలకు ఈ ఆర్థిక సంవత్సరం కాసుల వర్షం కురిపించింది. అందులో ఆర్టీఏ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా మంచి ఆదాయం వచ్చింది. అయితే ఆర్టీఏ పన్నుల వసూలులో ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని అధిగమించింది. ప్రధానంగా మార్చి నెలలో పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇన్‌స్పెక్టర్‌ల వారీగా టార్గెట్ ఇచ్చి పెండింగ్ బకాయిల డ్రైవ్ చేపట్టింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రూ.102.46కోట్ల ఆదాయం వచ్చింది. వాహనాల జీవిత పన్ను, త్రైమాసిక పన్నులు, రుసుములు, సేవా రుసుములు, నూతన లైసెన్స్‌లు, రెన్యూవల్స్ ద్వారా ఆదాయం భారీగా సమకూరింది. ఇక.. జిల్లాలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగిన రిజిస్ట్రేషన్లతో సుమారుగా రూ.100.32 కోట్ల ఆదాయం సమకూరింది

రవాణా శాఖ ద్వారా

ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయం ద్వారా అధిక రాబడి వచ్చింది. సూర్యాపేట ఆర్టీఏ కార్యాలయం, కోదాడ యూనిట్ ఆఫీస్, కోదాడ చెక్‌పోస్టు పరిధిలో ఆయా పన్నుల ద్వారా రూ.102.46కోట్ల ఆదాయం వచ్చింది. త్రైమాసిక పన్నుల ద్వారా రూ.29.26 కోట్లు, లైఫ్ ట్యాక్స్ ద్వారా రూ.51.18 కోట్లు, లైసెన్స్‌లు, రెన్యూవల్స్, నూతన వాహనాల రిజిస్ట్రేషన్‌ల ద్వారా రూ.12.62 కోట్లు, సేవా రుసుముల ద్వారా రూ.3.43కోట్లు వసూలు అయ్యాయి. ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఆర్టీఏ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లోనే 1500 వాహనాల నుంచి రూ.5కోట్ల వరకు ఫెనాల్టీలు విధించారు. పన్నులు చెల్లించే వివిధ వాహనాలు ఇంకా 13,412 ఉన్నాయి. కాగా.. గతేడాది 2021–22లో ఆయా పన్నుల ద్వారా రూ.66.36 కోట్లు మాత్రమే వచ్చాయి.

> **స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం**
> ఈ ఆర్థిక సంవత్సరం 2022– 23లో జిల్లా రవాణా శాఖకు ఆదాయం పెరిగింది. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువగా వచ్చింది. మార్చిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు చెల్లించని వాహనాలకు ఫెనాల్టీతో వసూలు చేశాం. ఇంకా ఎవరైనా వాహనదారులు పన్నులు చెల్లించని వారుంటే మీ సేవా ద్వారా చెల్లించాలి.
> – వెంకట్‌రెడ్డి, ఆర్టీఓ, సూర్యాపేట

మద్యం విక్రయాలు కొంతమేర తగ్గినా..

సూర్యాపేట: జిల్లాలో మద్యం విక్రయాలు కొంత మేర తగ్గినా పెరిగిన ధరలతో ఎక్సైజ్ శాఖకు ఆదాయాన్ని బాగానే తెచ్చిపెట్టింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ. 2కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. జిల్లాలోని 95మద్యం దుకాణాల్లో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బీర్ల విక్రయాలు ఎక్కువగా జరిగాయి. లిక్కర్ అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. 2022లో రూ.11.79కోట్లు రాగా.. 2023లో రూ.13.03కోట్ల ఆదాయాన్ని రాబట్టింది.

రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా..

భానుపురి (సూర్యాపేట): భూముల విలువ పెరగడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం మంచి దశలో ఉండడంతో ప్రభుత్వ ఖజానాకు రాబడి అధికంగానే ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగిన రిజిస్ట్రేషన్లతో సుమారుగా రూ.100.32 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ పరిధిలో రూ.49.68 కోట్లు, కోదాడ పరిధిలో రూ.37.98 కోట్లు, హుజూర్‌నగర్ పరిధిలో రూ.12.66 కోట్ల చొప్పున ఖజానాకు జమయ్యాయి.

గతేడాది కన్నా రూ.21.41 కోట్లు అధికం..

గత ఆర్థిక సంవత్సరం (2021–22) ఈ శాఖతో ప్రభుత్వానికి రూ.78.91 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం డాక్యుమెంట్ల సంఖ్య గతేడాదితో పోల్చితే పెరగకపోయినప్పటికీ ఆదాయం మాత్రం రూ.21.41 కోట్లు అధికంగా రాగా.. మొత్తం రూ.100.32 కోట్ల రాబడి సమకూరింది. కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో గతేడాది కన్నా 546 డాక్యుమెంట్లు పెరగ్గా, రూ.12.99 కోట్ల రాబడి వచ్చింది. ఇక సూర్యాపేట పరిధిలో 85 డాక్యుమెంట్లు మాత్రమే పెరగ్గా.. ఆదాయం రూ.5.42 కోట్లు, హుజూర్‌నగర్ పరిధిలో 926 డాక్యుమెంట్లు పెరగ్గా, రూ.3 కోట్లు అధికంగా వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరం చివర్లో భూముల విలువ, రిజిస్ట్రేషన్లు, స్టాంప్ డ్యూటీని పెంచడంతో డాక్యుమెంట్లు పెరగకపోయినా ఆదాయం మాత్రం గణనీయంగా వృద్ధి చెందింది.

● కనుల'పంట'గా..



భూగర్భ జలాలు పెరగడంతో ఆత్మకూర్ మండలంలో ఎటు చూసినా పచ్చని వరి పొలాలే దర్శనమిస్తున్నాయి. ఓ వైపు చెరువు.. మరోవైపు వరి చేలు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. కొద్దిరోజుల్లో వరి కోతకు రానుంది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



అవగాహన కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రతిఒక్కరూ సీపీఆర్ (కార్డియో పల్మోనరీ రిససిటేషన్)పై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీపీఆర్‌పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆకస్మిక గుండెపోటుతో సంభవించే మరణాలను తగ్గించేందుకు వైద్య ఆరోగ్యశాఖతో పాటు సాధారణ ప్రజలందరికీ సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. జీవన విధానంలో మార్పులు, ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, తదితర కారణాలతో వయస్సు నిమిత్తం లేకుండా గుండెపోట్లు వస్తున్నాయన్నారు. సీపీఆర్‌తో 50 శాతం గుండెపోటు మరణాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో వేగంగా మార్పులు తీసుకువచ్చిందని, గతంలో ప్రభుత్వ దవాఖానాలకు పోవద్దని, దానిపై పాటలు కూడా పాడేవారని, కానీ నేడు ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడడంతో ప్రజలు అధిక సంఖ్యలో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తున్నారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. గతంలో సిబ్బంది కొరత ఉండేదని, ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులు ప్రైవేట్‌కు దీటుగా నడుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, మోహన్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పెరుమాళ్ల అన్నపూర్ణ, జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, డీఎంహెచ్‌ఓ కోటాచలం పాల్గొన్నారు.

మహిళా హితం.. ఏపూరు

- మహిళా హితం విభాగంలో రాష్ట్ర స్థాయి ద్వితీయ ఉత్తమ పంచాయతీగా ఎంపిక



మహిళా దినోత్సవం సందర్భంగా సమావేశమైన మహిళలు (ఫైల్)

ఆత్మకూర్- ఎస్(సూర్యాపేట): ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని ఏపూరు గ్రామ పంచాయతీ మహిళా హితం విభాగంలో రాష్ట్ర స్థాయి ద్వితీయ ఉత్తమ పంచాయతీగా ఎంపికై.. జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీకి నామినేట్ అయింది. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డిలు సర్పంచ్ సానబోయిన రజిత, పంచాయతీ కార్యదర్శి ఉమకు అవార్డు అందజేశారు.

మహిళలదే అగ్రస్థానం..

మంత్రి జగదీశ్‌రెడ్డి దత్తత గ్రామమైన ఏపూరులో అత్యధిక విభాగాలకు మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వ్యాపారం, వాణిజ్యంతో పాటు వ్యవసాయంలోనూ మహిళలు చైతన్యవంతంగా వ్యవహరిస్తుండడంతో అవార్డుకు ఎంపికైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. గ్రామ జనాభాలో మహిళలు ఎక్కువగా ఉండగా సర్పంచ్, ఉపసర్పంచ్‌లుగా కూడా మహిళలే ఎన్నికయ్యారు. 12 వార్డులకు 6 వార్డుల్లో మహిళలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డాక్టర్‌తో పాటు పలు శాఖల్లో సైతం మహిళలు ఉన్నారు. దీనికి తోడు గ్రామంలో బాలికలు, మహిళల ఆత్మరక్షణకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తున్నారు. అంతేకాకుండా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, పౌష్టికాహారం, వాక్సినేషన్, హెల్త్ చెకప్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలువురు మహిళా సంఘం సభ్యులు పావలా వడ్డీ రుణాలు తీసుకుని పలు రకాల షాపులు నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదగడంతో రాష్ట్ర స్థాయిలో మహిళా స్నేహ పూర్వక గ్రామ పంచాయతీగా ఎన్నికైంది.

> **మంత్రి సహకారంతో అభివృద్ధి**
> 
> మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. గతంలో తీవ్ర నీటి సమస్య ఉండగా దానిని అధిగమించాం. గ్రామ సభల ద్వారా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. అందరి సహకారంతోనే అవార్డు వచ్చింది. రాష్ట్ర స్థాయిలో అవార్డు రాడం సంతోషంగా ఉంది.
> – సానబోయిన రజిత, సర్పంచ్, ఏపూరు

ఉపాధి కూలీల వేతనం పెంపు

- రూ. 257 నుంచి రూ. 272కు పెంచిన ప్రభుత్వం
- నేటి నుంచి పెరిగిన వేతనాల ప్రకారం కూలి
- 5,78,477 మంది ఉపాధి కూలీలకు ప్రయోజనం



చిలుకూరులో ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

దురాజ్‌పల్లి, చిలుకూరు: గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు వేతనం పెరిగింది. రోజువారీ గరిష్ఠ వేతనానికి రూ.15 అదనంగా దక్కనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి కూలీల వేతన వివరాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రస్తుతం గరిష్ఠ వేతనం రూ. 257 ఉండగా.. మరో రూ.15 పెంచి రూ.272 చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 5,78,477 వేల మంది కూలీలకు ప్రయోజనం చేకూరనుంది. పెంచిన వేతనం ఏప్రిల్ 1 నుంచి (శనివారం) నుంచి వర్తించనుంది.

2,61,479 కుటుంబాలకు జాబ్ కార్డులు

ప్రస్తుతం ఒక్కో కూలీకి చేసిన పనిని బట్టి ఒక్కో పనిదినానికి గరిష్ఠంగా రూ. 257చొప్పున చెల్లిస్తున్నారు. దీనిని మరో రూ.15 పెంచి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి గరిష్ఠంగా రూ. 272 చెల్లించనున్నారు. జిల్లాలో 2,61,479 కుటుంబాలకు ఉపాధి హామీ జాబ్ కార్డులున్నాయి. వీటిలో 5,78,477 మంది కూలీలు ఉన్నారు. కాగా.. 2019–20లో రూ. 205 నుంచి రూ. 211కి, 2020–21లో రూ.211 నుంచి రూ.237, 2021–22లో రూ. 237 నుంచి రూ.245, 2022–23లో రూ. 245 నుంచి రూ.257కు ప్రభుత్వం పెంచగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 272కు పెంచింది.

నిరుపేద కుటుంబాలకు లబ్ధి..

పెంచిన వేతనంతో నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఉపాధి హామీ పథకంలో పనులు కేటాయించి, కొలతలు వేసి, చెల్లింపులకు మస్టర్ నమోదు చేస్తారు. అందుకనుగుణంగా కూలీలకు డబ్బులు చెల్లిస్తారు. వేసవిలో నిర్దేశిత కొలతల ప్రకారం కేటాయించిన పనిలో కొంత చేయలేకపోయినా సమాన వేతనం అందుతుంది. ఉదాహరణకు ఒక చదరపు మీటర్ పనికి రూ.100 చెల్లించాల్సి ఉంటే.. ఆ పనిలో కాస్త తగ్గినా రూ.100 పూర్తిగా చెల్లిస్తారు. కూలీలకు గరిష్ఠ వేతనం లభించేలా సంబంధిత అధికారులు పనులు కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నారు.

> **72లక్షల పని దినాల కల్పనే లక్ష్యం**
> గరిష్ఠ వేతనం రూ. 272కు పెంచుతూ పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది ఏప్రిల్ నుంచే అమలు చేస్తున్నాం. ఈ ఏడాది (2023–24 ఆర్థిక సంవత్సరంలో) 72 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాం. దీనికి సంబంధించి ఇదివరకే గ్రామ సభలు పెట్టి చేపట్టాల్సిన పనులు గుర్తించాం.
> – కిరణ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

రేషన్ దుకాణాల ద్వారా పోస్టల్ సేవలు

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రభుత్వ రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పోస్టల్ బ్యాంకింగ్ సేవలు అందించనున్నట్లు అదనపు కలెక్టర్ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ దుకాణాల్లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా ప్రజలకు లావాదేవీలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రేషన్ డీలర్ల బిజినెస్ కరస్పాండెంట్ ఏర్పాటు చేసి ప్రజలకు ఈ సేవలు అందించనుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మినీ బ్యాంకు సేవలు అందించేందుకు ఆసక్తి కలిగిన డీలర్లు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ పుల్లయ్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్ సుదర్శన్‌రెడి పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ



ఊంజలి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాల్ అమ్మవారికి తిరువీధి, ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి, ఆలయ మాడ, తిరు వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజలి సేవ జరిపించారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూలకు నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాతం, ఆరాధన, అర్చన, సుదర్శనహోమం, నిత్య కల్యాణం గావించారు. వివిధ విభాగాల ద్వారా స్వామి వారికి రూ.17,74,596 నిత్యాదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేకార్చనలు జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం, ఎదుర్కోళ్ల మహోత్సవం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

తిరుమలగిరి (తుంగతుర్తి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలో బీజేపీ బూత్ స్వశక్తీకరణ్ అభియాన్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. 9 సంవత్సరాల్లో బంగారు తెలంగాణ అంటూ కేవలం కల్వకుంట్ల ప్రభుత్వమే బంగారు కుటుంబంగా మారిందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేవలం ఐదు శాతం మందికి కూడా అందలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇంటి నిర్మాణం కోసమే రూ.3 లక్షలు ఇస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రీడిజైన్ చేసి లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీల వల్ల 40 మంది యువతీ యువకులు టీఎస్‌పీఎస్సీ మీద నమ్మకం కోల్పోయారని అన్నారు. లీకేజీపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడెం రామచంద్రయ్య, పార్లమెంట్ విస్తారక్ రాజేష్, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, యాదగిరి, సాయిబాబా, పూలమ్మ, దీన్‌దయాళ్, హన్మంతు, రాజు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

- ఎస్పీ రాజేంద్రప్రసాద్



ధ్యానం చేస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం : ధ్యానంతో ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం శ్రీరామచంద్ర మిషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందుతున్న పోలీసు అభ్యర్థులకు సూర్యాపేట పట్టణంలోని అంతటి విజయ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ధ్యాన శిక్షణ శిబిరాన్ని ఎస్పీ, ఇంటర్మీడియట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రిటైర్డ్ అధికారి సుహాసినితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉంటామన్నారు. జ్ఞాపకశక్తి మెరుగుపడి అనుకున్న లక్ష్యాలను చేరగలుగుతామని తెలిపారు. ప్రతిరోజు యోగా ధ్యానం మెడిటేషన్ చేయడం వల్ల ఎంతగానో ఉపశమనం లభిస్తుందన్నారు. ఇంటర్మీడియట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రిటైర్డ్ అధికారి సుహాసిని మాట్లాడుతూ మన దేశంలో ధ్యానం, యోగాకు అత్యంత ప్రాధాన్యత ఉన్నదని ధ్యానం చేయడం వల్ల మంచి అనుభూతిని పొందగలుగుతామని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడి నైనా ఈ ధ్యానం వల్ల తట్టుకోగలమని చెప్పారు. అనంతరం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చాలా కీలకమని ఎస్పీ తెలిపారు. ప్రమాదాలు సంభవించి ఒక వ్యక్తి యొక్క గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోని స్థితిలో ఉన్నప్పుడు వారి ప్రాణాలు కాపాడడానికి సీపీఆర్ అనేది చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, ఎస్బీ ఎస్ఐ శ్రీనివాస్, సీఐలు సోమ్ నారాయణ్ సింగ్, రాజశేఖర్, గౌరీ నాయుడు, ఆర్ఐలు శ్రీనివాస్, నరసింహారావు, ఎస్ఐలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఐకమత్యంతో పోరాడాలి

- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం

హుజూర్‌నగర్ (చింతలపాలెం): రైతులు తమ భూములను కాపాడుకునేందుకు ఐకమత్యంతో పోరాడాలని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం సూచించారు. చింతలపాలెం మండలంలోని పాత వెల్లటూరు వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న లిఫ్ట్ నిర్మాణ, పైపుల తయారీ ప్రాంతం, రైతుల భూములతో పాటు పాతలిఫ్ట్‌ను ఆయన పరిశీలించారు. కొత్త లిఫ్ట్ వల్ల తమకు లాభం కన్నా నష్టమే ఎక్కువ అని, పాతలిఫ్ట్‌కే మరమ్మతులు చేయించి నడిపించాలని ఈ సందర్భంగా రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండరాం మాట్లాడారు. అన్యాయంగా భూములు పోతున్నప్పుడు రైతులు ఊరుకోవద్దన్నారు. ఐకమత్యంతో ప్రభుత్వంపై పోరాడాలని, అందుకు తమ పూర్తి



రైతులతో మాట్లాడుతున్న కోదండరాం

మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేసే ఈపని కరెక్టు కాదని, పాత లిఫ్ట్ కట్టి పదేళ్లు కూడా కాలేదని ఆయన చెప్పారు. ఉన్న దానిని నడపకుండా కాంట్రాక్టర్ల జేబులు నింపే ప్రాజెక్టు తమకు వద్దని ఆయన చెప్పారు. రైతులందరూ లిఫ్ట్‌కు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. భూనిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడపల్లి ఆశప్ప మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా లిఫ్ట్ నిర్మాణం జరపడం దుర్మార్గమన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించిరైతులకు న్యాయం జరిగేలా పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు ఎ నాగయ్య, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎం మల్లయ్య, భిక్షం, నిర్వాసిత రైతులు యర్రం లక్ష్మారెడ్డి, కె శ్రీనివాసరెడ్డి, వర్రా వెంకటరెడ్డి, మౌలాలి, శంభిరెడ్డి, సుదరమౌళీశ్వర రెడ్డి, మాధవరెడ్డి, ముడెం వీరారెడ్డి పాల్గొన్నారు.

వర్షంలోనే కొనసాగిన సభ

నూతన లిఫ్ట్ ప్రాంతంలో ప్రొఫెసర్ కోదండరాం రైతులతో సమావేశం ప్రారంభించగానే వర్షం ప్రారంభమైంది. సమావేశం ఆద్యాంతం వర్షంలోనే కొనసాగింది. అయినా రైతులు ఎటూ వెళ్లకుండా వర్షంలోనే తడుస్తూ ప్రసంగం విన్నారు. అవసరమైతే మళ్లీ వస్తానని కోదండరాం చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పీఆర్‌టీయూలో 'ఎమ్మెల్సీ' చిచ్చు

- యూనియన్ నుంచి సుంకరి భిక్షంగౌడ్ సస్పెన్షన్
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో వ్యతిరేక వర్గానికి పనిచేసినట్లు గుర్తించిన కమిటీ
- జిల్లా అధ్యక్ష పదవి నుంచి తొలగింపు
- జిల్లాకు చెందిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిపై సైతం వేటు
- ఉపాధ్యాయుల్లో పెద్ద ఎత్తున చర్చ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పీఆర్‌టీయూలో ఎమ్మెల్సీ ఎన్నిక చిచ్చు రేపింది. రంగారెడ్డి – మహబూబ్ నగర్ – హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో యూనియన్ వ్యతిరేక వర్గానికి అనుకూలంగా పని చేసిన వారిపై ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ వేటు వేసింది. అందులో నల్లగొండ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా పని చేస్తున్న సుంకరి భిక్షంగౌడ్ ఉన్నారు. ఆయన యూనియన్ బలపరచిన అభ్యర్థికి కాకుండా, ప్రత్యర్థికి అనుకూలంగా పని చేశారని ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ విచారణ చేసి తేల్చడంతో రాష్ట్ర కమిటీ భిక్షంగౌడ్‌ను యూనియన్ నియమావళి 20 హెచ్ ప్రకారం ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు ప్రకటించింది. అలాగే జిల్లాకు చెందిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నల్లమేకల వెంకయ్యపై కూడా వేటు పడింది.

వేటు పడిన ఆరుగురిలో ఇద్దరు మనోళ్లే..

పీఆర్‌టీయూలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా భిక్షంగౌడ్ సుదీర్ఘకాలం పనిచేశారు. ఐదేళ్లు ప్రధాన కార్యదర్శిగా, 8 ఏళ్లుగా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఆయన అంతకుముందు కూడా యూనియన్‌లో వివిధ హోదాలో పని చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్, పీఆర్‌టీయూ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) సంఘాల మధ్య గట్టి పోటీ ఏర్పడింది. వాస్తవానికి అధిక సభ్యత్వం కలిగిన సంఘాల్లో పీఆర్‌టీయూ ముందుంది. తరువాత టీఎస్ యూటీఎఫ్ ఉంటుంది. ఈ రెండు సంఘాల మధ్యనే పోటీ ఉంటుందని, పీఆర్‌టీయూ విజయం సాధిస్తుందని ఆ యూనియన్ భావించింది. ఫలితాలు మాత్రం అందుకు విరుద్ధంగా వచ్చాయి. టీపీయూఎస్ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి విజయం సాధించారు. దీంతో అత్యంత బలమైన సంఘం అయి ఉండి ఏవిధంగా ఓడిపోయామని రాష్ట్ర యూనియన్ పోస్టుమార్టం చేసింది. పలువురు యూనియన్‌లో ఉండి, బయటివారికి సపోర్టు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఆ నియోజకవర్గం పరిధిలో ఉండి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పని చేస్తున్న దాదాపు 650 మంది ఉపాధ్యాయులతో తమ యూనియన్ అభ్యర్థికి ఓట్లు పడేలా చూడకుండా ప్రత్యర్థికి అనుకూలంగా పని చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో రాష్ట్ర యూనియన్ ఐదుగురు సభ్యులతో కమిటీ వేసింది. ఆ కమిటీ విచారణ చేసి ఆరుగురు యూనియన్ నాయకులు తమ అభ్యర్థి కోసం పని చేయకుండా, ప్రత్యర్థి కోసం పని చేసినట్లు తేల్చింది. దీంతో ఆ ఆరుగురిని తొలగిస్తున్నట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ప్రకటించారు. అందులో జిల్లాకు చెందిన భిక్షంగౌడ్‌ను, నల్లమేకల వెంకయ్య ఉన్నారు.

జిల్లా ఉపాధ్యాయుల్లో పెద్ద ఎత్తున చర్చ

గతంలో ఎప్పుడూ లేనివిధంగా యూనియన్ వ్యతిరేక విధానాలకు పాల్పడిన విషయంపై పీఆర్‌టీయూ ఒకేసారి ఆరుగురిని తొలగించడం చర్చనీయాంశంగా మారింది. అందులో జిల్లాకు చెందిన వారే ఇద్దరు ఉండటం, అందులోనూ సుదీర్ఘకాలంగా పని చేస్తున్న భిక్షంగౌడ్ ఉండటంతో జిల్లా ఉపాధ్యాయుల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. 2019లో జరిగిన నల్లగొండ – ఖమ్మం – వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్ ఓడిపోయారు. అప్పుడు కూడా పీఆర్‌టీయూలోని ఒక వర్గం యూనియన్ బలపరచిన అభ్యర్థికి పని చేయలేదనే ప్రచారం జరిగింది. అందువల్లే పీఆర్‌టీయూ అభ్యర్థి ఓడిపోయారని అప్పట్లో రాష్ట్ర యూనియన్‌లోనూ చర్చ జరిగింది. అయినా అప్పట్లో ఇలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు మాత్రం పక్కా చర్యలు చేపట్టింది.

తాత్కాలిక అధ్యక్షుడిగా డీవీఎస్ ఫణికుమార్

పీఆర్‌టీయూ జిల్లా తాత్కాలిక అధ్యక్షుడిగా డీవీఎస్ ఫణికుమార్‌ను నియమించారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న సుంకరి భిక్షంగౌడ్‌ను జిల్లా అధ్యక్ష పదవి నుంచి, ప్రాథమిక సభ్యత్వం నుంచి రాష్ట్ర యూనియన్ తొలగించినట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు యూనియర్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు.

ఎమ్మెల్సీగా పోటీకి వస్తాననే..

– సుంకరి భిక్షంగౌడ్

భవిష్యత్‌లో ఎమ్మెల్సీగా పోటీకి వస్తానన్న భయం మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌లో ఉంది. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీకి వస్తాననే భయం శ్రీపాల్‌రెడ్డిలో ఉంది. అందుకే నన్ను సస్పెండ్ చేశారు. ఆయన చేసిన సస్పెన్షన్ చెల్లదు. నేను జనరల్ బాడీ ద్వారా ఎన్నికయ్యాను. జనరల్ బాడీ ద్వారానే నాపై చర్య తీసుకోవాలి. రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీపాల్ రెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. నేనే ఆయన్ను బహిష్కరిస్తున్నా.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



చెవుల రోషమ్మ మృతదేహం

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన 14మంది కూలీలు గత నెల 25న ఆకుపాముల వద్ద జీఎమ్మార్ సంస్థ ఆధ్వర్యంలో రహదారిపై పనులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో కూలీల ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ప్రమాదంలో అక్కడికక్కడే నేలమర్రి వినోద, అదే రోజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుమ్మల ధనమ్మ మృతిచెందారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చెవుల రోషమ్మ(55)ను కుటుంబసభ్యులు తొలుత ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఐదు రోజులుగా మృత్యువుతో పోరా డిన రోషమ్మ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. దీంతో ప్రమాద మృతుల సంఖ్య మూడుకు పెరిగింది. మృతురాలు రోషమ్మకు కుమార్తె, కుమారుడు, భర్త ఉన్నారు.

ఉప సర్పంచ్‌ను తొలగించాలని ఫిర్యాదు

తుర్కపల్లి: మండలంలోని ముల్కలపల్లి ఉప సర్పంచ్ ఉదయ్‌కుమార్‌ను తొలగించాలని వార్డు సభ్యులు, గ్రామస్తులు ఎంపీడీఓ ఉమాదేవికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతికి పాలుపడుతున్నందుకు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో వార్డు సభ్యులు, శంకర్, వీరేశ్, వాలీ, అరుణ, అలివేల, లక్ష్మీ తదితరులున్నారు.

అత్తింటి వేధింపులతోనే ఆత్మహత్య

- మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ

నేరేడుచర్ల : అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధించడంతో తమ కుతూరు గేయశ్రీ(28) ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు డొకుపర్తి ఈశ్వరనాగ ప్రసాద్ గుప్తా ఆరోపించారు. నేరేడుచర్లలో గురువారం ఆత్మహత్యకు పాల్పడిన గేయశ్రీ ఇంటికి శుక్రవారం కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్ రెడ్డి వెళ్లి విచారణ చేపట్టారు. అదనపు కట్నం కోసం ఆమె భర్త ఆత్కూరి సుబ్బారావు, అత్త పద్మ శారీరకంగా, మానసికంగా, సూటిపోటి మాటలతో వేధించారని డీఎస్పీకి తెలిపారు. మృతురాలి తండ్రి ఈశ్వరనాగ ప్రసాద్ గుప్తా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నవీన్‌కుమార్ కేసు నమోదు చేసుకోగా డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రావు తదితరులు

- బీజేపీ భువనగిరి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు

ఆలేరురూరల్ : ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బిజీగా ఉన్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆరోపించారు. శుక్రవారం ఆలేరు రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం వాటా నిధులతో ఒకవైపు పనులు పూర్తికాగా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన మరో వైపు పనులు మూడేళ్లుగా నిలిచిపోయాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో రైల్వేగేటు వద్ద ఓ వృద్ధురాలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో చనిపోయిందని గుర్తుచేశారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్న ఎమ్మెల్యేని తొందర్లోనే కనువిప్పు కలగాలన్నారు. బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్యాలయాలు పాఠశాలలు, బ్యాంకులు రైల్వేగేటు ఇవతల ఉండడంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు పట్టాలు దాటుతూ ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. అండర్‌పాస్ పూర్తయ్యే వరకు పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, బడుగు జాహంగీర్, దూసరి రాఘవేంద్ర, చిరిగే శ్రీనివాస్, కౌన్సిలర్ సంగు భూపతి, బందెల సుభాష్, రాజశేఖర్‌రెడ్డి, తునికి దశరథ, ఐడియా శ్రీను, వీరేషం, రాజు, సిద్ధులు, శ్రీనివాస్, రమేష్, గంగేష్, కిషన్, శంకర్, హనుమంతు, సందీప్, భాస్కర్, సతీష్, సంపత్, వెంకటేష్, రవీందర్ పాల్గొన్నారు.

యాదాద్రిలో వ్యవసాయ శాఖ కార్యదర్శి పూజలు



రఘునందన్ రావుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు కుటుంబ సమేతంగా శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఆ తర్వాత ప్రధానాలయంలోని స్వయంభూవులను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలోని అద్దాల మండపం వద్ద వేదాశీర్వచనం జరిపించారు.

పోలీస్ కస్టడీకి 'కృష్ణవేణి' కరస్పాండెంట్

భువనగిరి : విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో రిమాండ్‌లో ఉన్న పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ రఘు వెంకట సురేష్‌కుమార్‌ను విచారణ నిమిత్తం శుక్రవారం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. మార్చి 20న పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారని వారు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా బాలల పరిరక్షణ విభాగం అధికారి సైదులు ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నల్లగొండ జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ నిమిత్తం అతడిని కస్టడీలోకి తీసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

నల్లగొండ క్రైం : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లుకు చెందిన ఆలకుంట్ల సుధాకర్ (38) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఉపాధి లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురైన సుధాకర్ గత నెల 29న ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపారు.

కుమార్తెపై బెంగతో తల్లి బలవన్మరణం

నల్లగొండ పట్టణంలోని లకుమారపు శ్రీనివాస్, ఝాన్సీ దంపతులకు కుమారుడు, కుమార్తె శ్రీజ సంతానం. శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఉన్నత విద్య అభ్యసించిన కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె శ్రీజకి ఎనిమిది మాసాల క్రితం అమెరికాలో స్థిరపడిన వ్యక్తితో వివాహం చేశారు. అయితే, కుమార్తె ప్రస్తుతం గర్భవతి. అమెరికాలో కుమార్తె ఎలా ఉందోనన్న బెంగతో తల్లి ఝాన్సీ తీవ్ర మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం భర్త లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇరుగుపొరుగు వారు గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రఘుపతి

- ప్రత్యర్థిపై ఒక్క ఓటుతో విజయం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నేతి రఘుపతి విజయం సాధించారు. శుక్రవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కమిటీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి టి.కిరణ్‌కుమార్, ఎండీ.నజీరుద్దీన్, నేతి రఘుపతి, ఎస్.రవీంద్రనాథ్ ఠాగూర్ పోటీ చేశారు. హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల్లో సమీప అభ్యర్థి టి.కిరణ్‌కుమార్‌పై ఒక్క ఓటు తేడాతో నేతి రఘుపతి విజయం సాధించారు. నేతి రఘుపతి 109, కిరణ్‌కుమార్ 108, రవీంద్రనాథ్ ఠాగూర్ 44, ఎండీ.రజీయుద్దీన్‌కు 6 ఓట్లు వచ్చాయి. నేతి రఘుపతి 2010లో మొదటిసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గెలుపొందారు.

నూతన కమిటీ వివరాలు...

అధ్యక్షుడిగా రఘుపతి, ఉపాధ్యక్షులుగా అయితగోని లాలయ్య, మోర ప్రవీణ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా జె.రవికుమార్, కోశాధికారిగా దాసరి యాదగిరి గెలుపొందారు.

మందు పిచికారీలో రక్షణ చర్యలు పాటించాలి

భూదాన్‌పోచంపల్లి : రైతులు పంట పొలాలకు మందు పిచికారీ చేసేటప్పుడు తగు రక్షణ చర్యలు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సస్యరక్షణ మందుల అవశేషాల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కులాల రైతులకు జిల్లా ఏరువాక, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని శస్యరక్షణ మందుల అవశేషాల విభాగం సౌజన్యంతో సస్యరక్షణ మందులు సురక్షిత పద్ధతులు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిచికారీ సమయంలో రైతులు తప్పనిసరిగా రక్షణ దుస్తులు, చేతికి గ్లౌజులు, ముక్కుకు మాస్కు, కళ్లకు రక్షణ కవచాలు, కాళ్లకు గమ్‌బూట్లు, తలకు తొడుగు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త జెమీనా, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్ కుమార్, శాస్త్రవేత్త మధుశేఖర్, ఏఓ ఏజాజ్ అలీఖాన్, సర్పంచ్ చిన్నలచ్చి లింగస్వామి, ఉపసర్పంచ్ లింగస్వామి, ఏఈఓలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

మహిళలు స్వశక్తితో ఎదగాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్డీఓ, చెరుపల్లి, పల్లా

యాదగిరిగుట్ట రూరల్: మహిళలు స్వశక్తితో ఎదిగి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆర్డీఓ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి. అన్నారు. పెద్దకందుకూరులో ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామానంద తీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరి, కంప్యూటర్ శిక్షణ ఇచ్చి శుక్రవారం సరిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చీరశ్రీశైలం, ఆరుట్ల ఫౌండేషన్ చైర్మన్ సుశీలా దేవి, సర్పంచ్ రాములు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడు దుర్మరణం



మైసయ్య మృతదేహం

చింతపల్లి : హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై మండల పరిధిలోని కుర్మేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని కుర్మేడుకు చెందిన అనంతుల మైసయ్య(60) శుక్రవారం గ్రామ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి ఒంగోలుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగు శబ్దానికి రైతుకు గుండెపోటు

- ఆస్పత్రికి తరలించేలోపే మృతి



రామయ్య (ఫైల్)

మేళ్లచెరువు : పిడుగు శబ్దానికి రైతుకు గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. సమీప రైతులు అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. మేళ్లచెర్వు మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేవూరు గ్రామానికి చెందిన రైతు సాధం రామయ్య (45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సమయంలో గాలివాన రావడంతో ఆరబెట్టిన మిర్చి పంటపై పట్టాలు కప్పేందుకు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. సమీప రైతులను సాయం చేయాలని కోరాడు. వారు వచ్చే లోపే కొద్ది దూరంలో పిడుగు పడిన శబ్దానికి రామయ్య అక్కడే కుప్పకూలిపోయాడు. రైతులు అతడిని రామాపురం రెయిన్ సిమెంట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కొండమల్లేపల్లి : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాకు చెందిన మూఢావత్ కవిత తీవ్రమైన కడుపు నొప్పిని భరించలేక మార్చి 27న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన భర్త కన్వర్‌లాల్ ఆమెను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నీమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా, అక్కడ కవిత చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూ వివాదాలతో వ్యక్తిపై హత్యాయత్నం

గరిడేపల్లి : భూ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ముగ్గురు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన గరిడేపల్లి మండలం పొనుగోడులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జూలకంటి మైసయ్యకు అతడి సోదరుడి కుమారుడు నరేష్‌కు భూ వివాదాలు ఉన్నాయి. వాటిని మనసులో పెట్టుకుని నరేష్ తన స్నేహితులైన కొమరాజు దుర్గయ్య, నందిపాటి మధులు కలిసి బైక్‌పై గరిడేపల్లికి వెళ్తున్న మైసయ్యను దారికాసి కర్రలు, రాళ్లు, కొడవళ్లతో దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన మైసయ్యను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. భర్తపై హత్యయత్నానికి పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మైసయ్య భార్య నాగమణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ పంచాయతీలకు పురస్కారం

ఉమ్మడి జిల్లాలోని నాలుగు గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాలలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసింది. ఈ మేరకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కారాలను అందజేసింది. సోలార్ విద్యుత్ వినియోగంలో చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామం రాష్ట్ర స్థాయిలో నాల్గవ స్థానం పొందింది. బాలల హిత పంచాయతీ విభాగంలో మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్ మూడోస్థానం, 'స్వయం సమృద్ధి' విభాగంలో రామన్నపేట మండలం వెల్లంకి గ్రామం రెండోస్థానం పొందాయి. అదేవిధంగా 'మహిళా హితం' విభాగంలో ఆత్మకూర్.ఎస్ మండలంలోని ఏపూర్ గ్రామం రెండో స్థానంలో నిలిచింది.

–సాక్షి నెట్‌వర్క్



సోలార్ వినియోగం కేటగిరీలో మంత్రి కేటీఆర్ నుంచి అవార్డు అందుకుంటున్న పంతంగి సర్పంచ్ బాతరాజు సత్యం, చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి తదితరులు



మహిళా హితం కేటగిరీలో మంత్రి కేటీఆర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఏపూరు సర్పంచ్ సానబోయిన రజిత, పంచాయతీ కార్యదర్శి ఉమ, చిత్రంలో మంత్రి దయాకర్‌రావు, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక, డీపీఓ, డీఆర్‌డీఓ తదితరులు



బాలల హితం కేటగిరీలో పురస్కారాన్ని మంత్రి కేటీఆర్ చేతులమీదుగా అందుకుంటున్న శ్రీనివాసనగర్ సర్పంచ్ వెంకటరమణచౌదరి, గ్రామ కార్యదర్శి అనిత



స్వయం సమృద్ధి విభాగంలో మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న వెల్లంకి సర్పంచ్ మహేందర్‌రెడ్డి, చిత్రంలో భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ